పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

- ట్యాంక్ బండ్‌పై విగ్రహం ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- జిల్లా వ్యాప్తంగా ఐలమ్మ వర్ధంతి



శాయంపేట : చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆమె విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆలోచనలో ఉందన్నారు. మంగళవారం ఆమె 39వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన సాయుధ పోరాటంలో దొరలు, రజాకార్లపై ఎదురుతిరిగిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఆమె సహాసాన్ని అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ రవి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రజక సంఘం మండల అధ్యక్షుడు జాలిగపు అశోక్, నాయకులు రమేశ్, రవి, మొగిలి, సాంబయ్య, అఖిల్, సదానందం, పరమేశ్వర్, రంజిత్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి వనిత చాకలి అయిలమ్మ పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని రజక సంఘం నాయకులు అన్నారు. ఐలమ్మ 39వ వర్ధంతిని మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద రజక సంఘం నాయకులు నిర్వహించారు. చాకలి అయిలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకారులకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి అయిలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం నాయకులు బోనగిరి కుమారస్వామి, నర్సింహులు, వెంకటరమణ, రవి, జంపయ్య, లక్ష్మణ్, వెంకటేశ్, సమ్మయ్య, మొగిలి, నాగరాజ్, శ్రీనివాస్, రమేశ్, అయిలయ్య పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ పోరాట యోధురాలని అఖిల భారతీయ ధోబి మహా సమాజ్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ రజక సంఘం అధ్యక్షుడు చాగంటి హనుమయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు భిక్షపతి, గువ్వల శేఖర్, లొంక రామస్వామి, లొంక సుధాకర్, కొల్లు రమేశ్, చాగంటి యాదగిరి పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : చాలకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని రజక సంఘం మండల అధ్యక్షుడు మాదారపు రతన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆమె 39వ వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నడిగట్టు నరేశ్, రఘు, శ్రీకాంత్, క్రాంతి, గణేశ్, రామస్వామి, రవి, మురార్జి పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతి రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ చిర్ర బోయిన శ్రీనివాస్, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల కేంద్రంతో పాటు మర్రిపల్లి గూడెం, ఉప్పల్ తదితర గ్రామాల్లో తెలంగాణ వీర వనిత ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహంచారు. ఐలమ్మ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘం జిల్లా కార్యదర్శి రవీందర్, డివిజన్ కార్యదర్శి సాంబయ్య, మండల అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి శంకర్, నాయకులు కొమురయ్య, కొంరెల్లి, తిరుపతి, రాజు, సురేశ్‌తో తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజకసంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, మాజీ ఉపసర్పంచ్ వాసు, నాయకులు రవి, చంద్రమోహన్, సుదర్శన్, వైకుంఠం, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆత్మకూరు : ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

పరకాలలో..

పరకాల : పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతితో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్, రజక సంఘం నాయకులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు సారంగపాణి, ప్రధాన కార్యదర్శి రాంమూర్తి, సలహాదారులు శంకర్, పరశురామ్, సాంబయ్య, నర్సింహమూర్తి పాల్గొన్నారు.



పరకాల : నివాళులర్పిస్తున్న మొలుగూరి భిక్షపతి



నడికూడలో..



దామెరలో..



కమలాపూర్‌లో..

క్లుప్తంగా

ఫ్రీజర్ అందజేత



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్–స్రవంతి దంపతులు మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి ఫ్రీజర్‌ను అందించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆడెపు సుధాకర్ జ్ఞాపకార్థం ఫ్రీజర్ అందించినట్లు తెలిపారు. చనిపోయిన వ్యక్తికి దహన సంస్కారాలు చేసేంత వరకు వినియోగించుకునే వీలుగా రూ.80వేల విలువ చేసే ఫ్రీజర్‌ను జీపీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణుకు అందించినట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



ఎల్కతుర్తి : మండలంలోని దామెర ఎస్సీకాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి దయాకర్ జ్ఞాపకార్థం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, నోడల్ ఆఫీసర్ రమణారెడ్డి, సల్మాన్, సమ్మయ్య, కుమార్, రాజేశ్వరి, జయప్రద పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన పలువురు నాయకులు



శాయంపేట : ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ కల్వల సత్యనారాయణను మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రవి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిస్థితులపై వివరించారు. అలాగే రజక సంఘం నాయకులు మొగిలి, సాంబయ్య, రమేశ్, రవి, సాంబయ్య, అఖిల్, సదానందం, అరవింద్, పరమేశ్వర్, రంజిత్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణితో పాటు పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

12న స్కూల్ గేమ్స్

వేలేరు : ఈనెల 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలను స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ.వెంకటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 సంవత్సరాల బాలికలకు 12వ తేదీన, బాలురకు 13వ తేదీన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కస్తూర్బాలో వైద్యశిబిరం



వేలేరు : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ స్రవంతి, ఫిజియోథెరపిస్టు ప్రహర్షిత్, హెల్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాల్లో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.నిర్మలను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో బలహీన వర్గాల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా 3, 5వ తరగతుల్లో లక్కీ డ్రా ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు అడ్మిషన్లు కల్పించారని తెలిపారు. ఆ విద్యార్థులకు గత రెండేళ్లుగా నిధులు రాకపోవడాన్ని వారు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రూ.49,650కి బదులు సున్నా బ్యాలెన్స్

- ఖంగుతిన్న ఖాతాదారుడు

ఆత్మకూరు : బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.49,650 ని విత్‌డ్రా చేద్దామని వెళ్లిన ఖాతాదారుడు బ్యాంక్ సిబ్బంది చెప్పిన సమాధానంతో ఖంగుతిన్నాడు. మండల కేంద్రానికి చెందిన ఎల్లబోయిన రమేశ్ దామెర మండలం ఊరుగొండ కెనరా బ్యాంక్‌లో అకౌంట్ పొంది ఉండగా అందులో రూ.49,650 డబ్బులు ఉన్నాయి. కాగా మంగళవారం నగదు తీసుకుందామని బ్యాంకుకు వెళ్లి విత్‌డ్రా అప్లికేషన్ ఇవ్వగా ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉందని సిబ్బంది చెప్పారు. దీంతో కంగుతిన్న రమేశ్.. తన అకౌంట్‌లో రూ.49,650 ఉండాలని బ్యాంకు అధికారులకు తెలిపాడు. అయితే ప్రస్తుతం అకౌంట్‌లో డబ్బులు లేవని, అకౌంట్ హ్యాక్ అయ్యిందేమోనని చెప్పారు. దీంతో బాధితుడు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

విషం పెట్టి చంపేశారు



ఆత్మకూరు : ఇంటి వద్ద పెంచుకుంటున్న కోళ్లను ఆహార పదార్థంలో విషం పెట్టి చంపేశారని మండల కేంద్రానికి చెందిన మంతుర్తి కొమురయ్య వాపోయాడు. బాధితుడి తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు రూ.10వేల విలువ చేసే నాలుగు కోళ్లను తమ ఇంటి సమీపంలో ఉండే మంతుర్తి రవి ఆహార పదార్థంలో విషం పెట్టి చంపేశాడని ఆరోపించాడు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. మృతిచెందిన కోళ్లను పశుసంవర్ధక శాఖ అధికారుల వద్దకు తీసుకెళ్లితే ఎఫ్ఐఆర్ అడిగారని, పోలీసులు తనను పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయాడు. కోళ్లను విక్రయిస్తే వచ్చే డబ్బులతో కొంతమేర ఇంటి ఖర్చులు వెళ్లేవని వాపోయాడు. పోలీస్ ఉన్నతాధికారులు పట్టించుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

వేర్వేరు చోట్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



ఆత్మకూరు : బియ్యాన్ని సీజ్ చేసి అరెస్టు చూపుతున్న సీఐ సంతోష్

ఆత్మకూరు : నర్సంపేట నుంచి మహారాష్ట్రలోని సిరొంచకు తరలిస్తున్న 55 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని ఆత్మకూరు పోలీసులు నీరుకుళ్ల సమీపంలో పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరు మండలం లంబాడపల్లికి చెందిన ఆలోతు రాజేశ్ (డ్రైవర్), ఆలం అరవింద్ ఉర్సుగుట్టకు చెందిన బియ్యం అక్రమ వ్యాపారి బత్తిని మహేందర్ సూచన మేరకు నర్సంపేట నుంచి సిరొంచకు బొలెరో వాహనంలో 55బస్తాలు (27 క్వింటాళ్ల 50 కిలోలు) రూ.35వేల750 విలువచేసే పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని సీజ్ చేసి రాజేశ్, అరవింద్‌ను అరెస్టు చేసినట్లు సీఐ సంతోశ్ ఈ సందర్భంగా వెల్లడించారు.


వేలేరులో..

వేలేరు : 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సురేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా (టీఎస్ 03 యూసీ 9576) ట్రాలీ ఆటో అనుమానస్పదంగా కనిపించిందని తెలిపారు. ట్రాలీ ఆటోను తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం లభించినట్లు తెలిపారు. డ్రైవర్ కస్తూరి శివప్రసాద్, యాజమాని కృష్ణ, పప్పు గుప్తా అనే ముగ్గురిపై కేసు నమోదు చేసి ట్రాలీ ఆటోను, పట్టుకున్న బియ్యాన్ని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నడికూడ : సన్మానిస్తున్న తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్



వేలేరు : హెచ్ఎం రాజన్నను సన్మానిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

నడికూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయుడు కే.హనమంతరావు, టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డు పొందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు ఆర్.శివకుమార్‌ను తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్ మంగళవారం శాలువాతో సన్మానించారు. అనంతరం చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు తహసీల్దార్ నాగరాజు నిఘంటువులను అందించారు. 4వ తరగతి విద్యార్థిని సఫియాను అభినందించి చదువుకు అవసరమయ్యే ఖర్చును పూర్తిగా తాను భరిస్తానని హామీ ఇచ్చారు. సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉత్తమమైన, ఆదర్శమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృపమ్మ, మహ్మద్ సుభాని, శ్రీనివాస్, జయ, సుమలత, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, కుమారస్వామి, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వేలేరు హెచ్ఎం రాజన్నను ఎంఈఓ వెంకటేశ్వరరావు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి రాజేశ్వరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలను వినియోగించుకోవాలి

హసన్‌పర్తి: సఖి కేంద్రం అందిస్తున్న సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని సఖి కేంద్రం అడ్మిన్ పి.హైమావతి సూచించారు. ఎర్రగట్టు క్రాస్‌లోని శివాని జూనియర్ కళాశాలలో సఖి కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురవుతున్న వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా గృహ హింస చట్టం గురించి వివరించారు. బాధిత మహిళలకు ఉచిత కౌన్సెలింగ్, వైద్యం, తాత్కాలిక వసతితో పాటు పోలీస్, న్యాయ సహాయం అందజేస్తున్నట్లు వివరించారు. కేస్ వర్కర్ హరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నయీంనగర్: మహిళలు, చిన్న పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్, కేస్ వర్కర్ వినీల, ఆర్పీ కల్పన సూచించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో హనుమకొండ లష్కర్‌సింగారంలో మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల రక్షణ కోసం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అసాల్ట్ యాక్ట్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. మహిళల రక్షణ కోసం గృహహింస చట్టం ఉందని వివరించారు.

సట్టా స్థావరంపై దాడి

ఖిలా వరంగల్: రహస్యంగా ఆడుతున్న ఆన్‌లైన్ సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి రూ.4వేల నగదు, స్మార్ట్ మొబైల్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి ఉర్సు కరీమాబాద్ బొడ్రాయికి చెందిన గుజ్జరి కిరణ్ ఆన్‌లైన్ సట్టా ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు.

యజమాని ఇంట్లో పనిమనిషి చోరీ

వరంగల్ క్రైం: బాలసముద్రంలో ఓ ఇంటిలో వృద్ధులకు కేర్‌టేకర్‌గా పనిచేస్తూ ఆ ఇంట్లోనే చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం విశాఖపట్నం జిల్లా అనకపల్లి, విజయ రామారావుపేటకు చెందిన ఎల్లపు సాయికుమార్.. ఓ ఇంట్లో కేర్‌టేకర్‌గా పనిచేస్తూ ఈనెల 7న ఇంట్లో వృద్ధులు నిద్రిస్తున్న సమయంలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 4జతల బంగారం కమ్మలు, బంగారు గొలుసు, స్మార్ట్ ఫోన్, కీ ప్యాడ్ ఫోన్, కారు తాళంచెవి, డెబిట్ కార్డును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

ఉర్సు చెరువు వద్ద ఏర్పాట్లు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ఉర్సు చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనానికి బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల తొలగింపు పనులను జేసీబీ యంత్రంతో చేపడుతున్నారు. చెరువులోని గుర్రపు డెక్కను కూలీలు తొలగిస్తున్నారు.

శ్వేతార్కుడికి ప్రత్యేక అలంకరణ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో భక్తులు మంగళవారం లక్ష గరిక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గరికలతో శ్వేతార్కుడిని అర్చకులు అభిషేకించారు. జేష్టాదేవి అమ్మవారికి లక్ష పుష్పార్చన చేశారు. పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, దేవులపల్లి సదానందం, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణలో శివాజీనగర్ గణపతి మండపం

ఆత్మకూరు : మండలంలో గణపతి నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేక అలంకరణలు, పూజలతో సందడి నెలకొంది. మండల కేంద్రంలోని శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని రాత్రి వేళ విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అలంకరణలు పలువురికి జిగేల్‌మనిపించాయి.

అవినీతి రహిత పాలనే ప్రభుత్వ లక్ష్యం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు : అవినీతి రహిత పాలనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాది ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. 91 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, 70 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలుకు అర్హులైన వారు మధ్యవర్తులను ఆశ్రయించొద్దన్నారు. నేరుగా అధికారులును కలిసి వారి సూచన మేరకు నడుచుకుంటే సంక్షేమ పథకం మీ ఇంటి గుమ్మం ముందు ఉంటుందన్నారు. అలాగే అర్హత కలిగిన ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ వస్తుందని, అందులో ఎలాంటి అపోహలు వద్దన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుందని అన్నారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం చేయని ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని, రైతులు గమనించాలని కోరారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, డీటీ అనిల్‌కుమార్, ఆర్ఐ మల్లయ్య పాల్గొన్నారు.

మైక్రో ఏటీఎం సేవలను వినియోగించుకోవాలి



పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలు ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

దామెర : మైక్రో ఏటీఎం సేవలను వినియోగించుకోవాలని ఏపీజీవీబీ బ్యాంకు దామెర శాఖ మేనేజర్ సింధూష వినియోగదారులకు సూచించారు. మండల కేంద్రంలోని బ్యాంకు మిత్ర కేంద్రంలో పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలను మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. వినియోగదారుల సౌకర్యార్థం బ్యాంకుమిత్ర కేంద్రంలో పాస్‌బుక్ ప్రింటింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏటీఎం పిన్, ఓటీపీ నంబర్లను అపరిచిత వ్యక్తులకు తెలియజేయొద్దని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ అఖిలాండేశ్వరి, ఐఆర్ఐఎక్స్ సంస్థ రీజనల్ ఇన్‌చార్జ్ శోభన్, చానల్ మేనేజర్ నరసింహ, రంజిత్, బ్యాంకు మిత్ర రాధిక, సునీల్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బుంగను పూడ్చిన అధికారులు



కట్టకు పడిన బుంగ

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో గల పెద్ద చెరవుకు మంగళవారం బుంగ పడింది. చెరువు తూము ప్రక్కన కట్టకు ఎలుకలు తోడగా నీరు బయటికి ప్రవహించింది. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి మాజీ ఎంపీటీసీ తోట నాగరాజుకు తెలుపగా.. ఆయన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి సమాచారం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే ఐబీ అధికారులను అప్రమత్తం చేసి చెరువు వద్ద ఏలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐబీ ఈఈ సీతారాంనాయక్, ఏఈ రాజేంద్రప్రసాద్, సీఐలు ప్రవీణ్ కుమార్, రాజు చెరువు వద్దకు చేరుకుని బుంగను పూడ్చి వేయించారు. తోట నాగరాజు తన స్వంత ఖర్చులతో జేసీబీ, ట్రాక్టర్లతో మట్టిని తరలించాడు.